

**అందరిలో ఒకరుగా జీవించడం కొందరికి సాధ్యం కాదు. సొంత వ్యక్తిత్వంతో గుబాళిస్తూ చుట్టూరా ఉన్న వాతావరణాన్ని పూలతోటగా మార్చడం వారికే సాధ్యం**

మ్యావ్ మ్యావ్" అని ఎక్కణ్ణించో, సన్నగా, చిన్నగా, బలహీనంగా ఒక కూత వినొచ్చింది.

కిటికీ పక్కగా కిటికీని ఆనుకొని ఉన్న బెంచిమీద కిటికీ వెలుగులో కూచుని చపాతీ తింటున్న మున్నీ కిటికీలో నుంచి బయటికి చూశారు ఎండలోకి. అంతలోనే బయటికి తెరచి ఉన్న కిటికీ తలుపు మీది నుంచి 'చంగ్'మని గభాలున దూకింది ఓ చిన్న పిల్లిపిల్ల తెల్లని దూది పింజెలా మున్నీ భుజంమీదికి. మున్నీ ఉలిక్కిపడ్డారు. ఎదురుగా టేబిల్ మీద పెరుగు అన్నం తింటున్న ఇంగ్లీషు టీచరు సత్యనారాయణ పక్కుమని నవ్వారు. మున్నీ కూడా నవ్వుతూ, "హడలిపోయాను సుమాండీ, ఇంకేమిటో అనుకుని" అంటూ, ఆ పిల్లికూనని చేత్తో దించి, కిటికీ అరుగుమీద పెట్టి, ఓ చిన్న చపాతీముక్క తినమని దాని నోటిదగ్గర పెట్టారు. ఆ పిల్లి తినకుండా మున్నీ రొమ్ము మీదికి ఎక్కి ఆయన ముఖంలోకి చూస్తూ ఇంకా దీనంగా, "మ్యావ్ మ్యావ్" మని అరుస్తూనే ఉంది.

"ఉండండి పాపం చిన్నపిల్ల. పెరుగు అన్నం పెట్టి చూద్దాం" అంటూ ఆయన తింటున్న చెంచాతోనే కాస్త పెరుగు అన్నం తీసి ఆ పిల్లికూన ముందర కిటికీ అరుగుమీద పెట్టేరు.

ఆ పిల్లి వెంటనే ఆత్రంగా ఆవురావురుమంటూ తిననారంభించింది.

"నిజానికది ఆకలితో చచ్చిపోతోంది. పిచ్చిముండ" అన్నారు ఇడ్లీలు తింటూ మ్యాథ్స్ టీచర్ అబ్రహామ్.

టేబిల్‌కి ఇంకోపక్కనుంచి "దానికి తల్లి లేనట్లుగా ఉంది. పాపం తల్లి లేని పిల్ల." నించుని కర్చీఫ్‌తో మెడ తుడుచుకుంటూ అన్నారు కంప్యూటర్ టీచర్ నిత్యానందం.

అంతలో బయటినుంచి చిన్న చిన్న నవ్వులతో చిన్నగా మాట్లాడుకుంటూ, మ్యూజిక్ టీచర్ కనకాంగి, సైన్సు టీచర్ మేరీ జాన్ గుమ్మం వద్దకు వచ్చి నిలబడ్డారు. పిల్లిపిల్ల వాళ్ళ కంట్లో పడగానే "అరెరే, ఈ పిల్లిపిల్ల, ఇదేమిటి ఇక్కడ టీచర్స్ రూమ్‌లోకి ఎలా వచ్చింది? ఇది హెడ్ మాస్టర్‌గారి గదిలో ఉండేదే" అన్నారు ముచ్చట గానూ, ఆశ్చర్యంగానూ కనకాంగి. "హెచ్.ఎంగారు షాపింగ్‌నుంచి ఇంకా రాలేదు కదూ. ఆకలి గావోల్ను దీనికి పాపం, లంచ్ అవర్ కల్లా ఇక్కడికొచ్చేసింది చూడండి." అందుకున్నారు మేరీజాన్ చిరునవ్వుతో. వెంటనే నిత్యానందం వైపు చూస్తూ కనకాంగి, "పువ్వులూ దండలూ తెమ్మన్నారు మమ్మల్ని పొద్దున్న హెచ్.ఎంగారు. ఇంకా ఏమైనా కావాలా అని సెక్రటరీగారిని అడిగి మరీ వెళ్ళమన్నారు" అన్నారు.

"అన్నీ ఉన్నాయి లెండి. ఇంకేమీ అక్కర్లేదు" అన్నారు నిత్యానందం లంచ్‌కి సిద్ధమవుతూ.

పెరుగు అన్నం తినేసి పిల్లిపిల్ల ఎంచక్కా గుండ్రంగా చుట్టుకుని, మున్నీ ఒళ్ళో పడుకుంది.

అందరి భోజనాలూ సాగుతున్నాయి.

"ఇవ్వాళనుంచీ మన స్కూలు స్కూలులాగానే ఉండదు. ఏదో కొరతగానే ఉంటుంది" అన్నారు సత్యనారాయణ.

"ఈ డిసిప్లిన్ ఇహ ఉండదు. ఇన్నేళ్ళూ మన స్కూల్లో అల్లర్లుగాని, తుంటరితనంగాని లేదంటే జాలయ్య మేస్టారు వల్లనేగా" అన్నారు అబ్రహామ్.

"అది ఆయన పర్సనాలిటీ. ఆయన్ని తల్చుకుంటేనే ఒక సింహస్వప్నం" అన్నారు తిరిగి సత్యనారాయణ.

"అది నిజం! ఆ చేతిలో బెత్తం, జరీతలపాగా, ఆ లాంగ్‌కోటూ, కిర్రు చెప్పులు, బిళ్ళగోచీ పంచె, పచ్చని ఛాయ, కోరమీసం, ఒడ్డూ పొడుగూ, ఆయన తీరే ఆయనది." గొంతు కలిపారు తెలుగు పండిట్ రాఘవేంద్రయ్య.

"అనలు మన స్కూల్లో ఇంతవరకూ రాగింగ్ లేదే. స్కూలుకు ఎంత పేరు. దానికంతా ఆయన భయమే కారణం" అన్నారు మున్నీ.

"అదంతా ఆయన వల్లనే" అన్నారు అబ్రహామ్. "ఆ చేతిలో బెత్తం పట్టుకొని ఆయన నడుస్తుంటే అందరికీ భయమే." పొడిగించారు తిరిగి.

"ఆయన అందరికన్నా సీనియర్ కాబోలు. అందుకనే అంత భారీ యెత్తున చేస్తున్నారు సెండాఫ్ ఫంక్షన్." అందుకున్నారు కొత్తగా వచ్చిన ఫిజికల్ ఇన్‌స్ట్రక్టర్ కుమార్ టై సర్దుకుంటూ.

> "ఈ డిసిప్లిన్ ఇహ ఉండదు. ఇన్నేళ్ళూ మన స్కూల్లో అల్లర్లుగాని, తుంటరితనంగాని లేదంటే జాలయ్య మేస్టారు వల్లనేగా!" అన్నారు అబ్రహామ్.

"అవును. అందువల్ల మాత్రమే కాదు. పేరూ ప్రతిష్ఠా అన్నీ నిలిపారు గదా. ఆ విశ్వాసం కూడాను హెచ్.ఎంగారికి" అన్నారు అబ్రహామ్.

"అసలు మన హెచ్.ఎంగారు వచ్చిన తరువాత మన స్కూలు అటెండెన్సు ఎంత ఎక్కువైందో తెలుసా? లేడీస్‌కు ప్రత్యేకంగా వెయిటింగ్ రూమ్ ఏర్పాటు చేశారు. బ్యాట్‌మింటన్ కోర్టు వేయించారు. నవీన పద్ధతుల్లోనే పోతున్నారు" అన్నారు మున్నీ పిల్లి పిల్లను చేత్తో నిమురుతూ.

"వారు ఇంగ్లండ్‌లో కూడా ట్రైనింగ్ చేశారుట. అసలే పెద్ద చదువులాయే" అన్నారు రాఘవేంద్రయ్య వక్కపొడి నోట్లో వేసుకుంటూ.

"వారే స్వయంగా టీవీ సెలక్ట్ చేయడానికి వెళ్ళారుటగా ప్యూన్ రామస్వామిని వెంట తీసుకుని. ఇప్పటివరకూ అన్నీ స్వయంగానే చేస్తున్నారాయన. మహా ఉత్సాహం. మనిషికి చురుకుదనం ఎక్కువ" అన్నారు ఇంకో టీచర్ చంద్రమౌళి.

ఆ రోజు శనివారం. అందువల్ల అందరూ సావకాశంగా ఉన్నారు. మాటా మంతీ అయ్యాక అందరూ గుంపులు గుంపులుగా బయటికి వచ్చి వరండా నీడలో విశ్రాంతి తీసుకుంటున్నారు.

సత్యనారాయణ, మున్నీ నిమ్మళంగా కాళ్ళీడ్చుకుంటూ పెండాల్ వద్దకు నడిచి వచ్చారు.

వేదిక చుట్టూ తోరణాలు కట్టేశారు. వేదిక పైన టేబిల్, అలంకారంగా ఫ్లవర్‌వాజ్, దానిలో పువ్వులూ, గ్లాసుల్లో నీళ్ళూ పెట్టి ఉన్నాయి.

వేదికకు వెనక భాగం తెరకట్టి ఉంది. తెర వెనుక సంగీతం రిహార్సల్స్ జరుగుతున్నాయి.

వేదిక పైన కుర్చీలు వేస్తున్నారు. ఎలక్ట్రీషియన్‌లు మైకులు అమరుస్తున్నారు.

వేదికకి ఎదురుగా ఉన్న చాలా ఖాళీ స్థలం చుట్టూ అక్కడక్కడా దారులు వదలి ఫెన్సింగ్ కట్టారు. దాని నిండా కుర్చీలు వేస్తున్నారు. ఖాళీ స్థలంలో పైన తోరణాలు కట్టారు.

వేదికకి ఒక పక్కన ఉన్న బుట్టలో పువ్వులూ, బొకేలూ సువాసనలు వెదజల్లుతున్నాయి.

సత్యనారాయణ, మున్నీ అక్కణ్ణించి టెన్నిస్ కోర్టు వేపు అడుగులు వేశారు. నిమ్మళంగా ఆ కోర్టు పక్కగా ఉన్న కొబ్బరి చెట్టు కింద వేసి ఉన్న బెంచీ మీద కూర్చున్నారు.

"అదిగో అప్పుడే యూనిఫార్మ్‌తో, కర్రలతో బోయ్ స్కౌట్స్ వచ్చేస్తున్నారు. గేటులోకి చూడండి" అన్నారు మున్నీ.

గేటుకు రెండు పక్కలా ఉన్న కానుగ చెట్లకి సీరియల్ లైట్లు అమర్చేశారు పెండాల్ వరకూ. బైట రోడ్డు మీద వెళ్ళే బస్సుల్లో నుంచి జనం మెడలు చాపి గేటు లోపలికి చూస్తున్నారు.

ఈ సభకి ఊళ్ళో ఉన్న పెద్ద మనుషులు, ఓల్డ్ స్టూడెంట్స్ కూడా వస్తారని తెలియంగానే బెలూన్లు, ఐస్‌క్రీమ్ అమ్మేవాళ్ళు అక్కడకు వచ్చేశారు.

సాయంత్రం తిరిగింది. ఆహ్వానితులు, పెద్ద మనుషులు, ఆడవాళ్ళు, పిల్లలు అక్కడ అమర్చిన కుర్చీల మీద వచ్చి కూర్చుంటున్నారు.

గేటులోనుంచి ఒక పని మనిషి పెద్ద ప్లాస్టిక్ బకెట్ నిండా ప్లాస్టిక్ కప్పులు పెట్టుకుని వస్తున్నాడు.

అతని వెనుక మరొక మనిషి రెండు పెద్ద కెటిల్స్ పట్టుకుని వస్తున్నాడు. కూడా ఒక టీచర్ అమ్మగారు వచ్చి గేటు వద్ద నించున్న స్కౌట్స్‌కు టీ నింపి కప్పుల్లో ఇస్తోంది.

"వాళ్ళంతా సెయింట్ ఇసబెల్లా కాన్వెంట్ స్టాఫ్. కాన్వెంట్ వంటావిడ హేండీక్యాప్ కొడుక్కి సీటూ, స్కాలర్‌షిప్ ఇప్పించారుట మన హెచ్.ఎంగారు. అందుకు కృతజ్ఞతతో మన ఈ ఫంక్షన్‌కి వచ్చిన వారికందరికీ టీ సప్లయ్ చేస్తామని

చెప్పారుట" అన్నారు సత్యనారాయణ.

అలా పిచ్చాపాటీ మాట్లాడుతుంటే సాయంత్రం దాటింది.

అయిదున్నర గంటలైంది. సభ కోసం వేసి ఉన్న కుర్చీలన్నీ నిండిపోతున్నాయి.

నిదానంగా జంట విగ్రహాల్లా నడుచుకుంటూ ఇద్దరు కన్యకా స్త్రీలు వచ్చి ముందర కుర్చీలలో కూచున్నారు.

"ఇంక మనం కూడా వెళదాం రండి. ఆరు కావస్తోంది" అంటూ సత్యనారాయణ, మున్షీ లేచేశారు.

గప్‌న ఎలక్ట్రిక్ దీపాలన్నీ ఒక్కసారిగా వెలిగాయి. ఆవరణ అంతటా ఒక పండుగ వాతావరణం వచ్చేసింది. బాగా డ్రెస్ చేసుకున్న ఉద్యోగస్థులు, పట్టు చీరలతో, పువ్వులతో అలంకరించుకున్న స్త్రీలు, బెలూన్లతో ఆడుతున్న పిల్లలతో ఆవరణంతా కళకళలాడుతోంది.

మైక్ టెస్ట్ అయిపోయింది. వెంటనే "గౌరవనీయులైన వారందరూ వారి వారి సీట్లలో కూర్చోవలసిందిగా ప్రార్థన" అన్నారు మైకులో కార్యదర్శి నిత్యానందం.

అంతట్లో చటుక్కున ఒక మారుతి కారు అతి వేగంగా వచ్చి వేదిక పక్కన నిల్చింది. నిలిచీ నిలవడంతోనే దానిలోంచి బయటకు దూకేసారు ముఖ్య అతిథి. స్కూల్ ఓల్డ్ స్టూడెంట్, యువకుడు ఐ.పి.ఎస్ ఆఫీసర్ చిరునవ్వుతో రెండు చేతులూ ముందరికి చాచుకుని రెండు రెండు మెట్లు ఒక అంగ వేసుకుంటూ టక్ టక్‌మని ప్లాట్‌ఫార్మ్ మీదకు వెళ్ళిపోయారు. హెడ్‌మాస్టర్ గారు చిరునవ్వుతో ఒక్క అంగలో ఎదురుగా వచ్చేసి ఆయన్ని గబుక్కున కౌగలించేసుకున్నారు. సభ అంతా ఒక క్షణం అలజడిగా మారింది.

ఒక్క అర నిమిషంలో మళ్ళా గాలిలో ఎనౌన్స్‌మెంట్ వచ్చేసింది, "కార్యక్రమం ఆరంభం అయింది" అని.

వెంటనే గుండెల మీద కొట్టినట్లు గట్టిగా పెద్దగా "పియానో" మీద వాయించిన శబ్దం వినొచ్చింది. వెను వెంటనే అన్ని వాద్యాలూ అందుకున్నాయి. పియానో శబ్దంతో పాటే ఒక తెల్లటి అంబాసిడర్ కారు ముఖం గేటులోనుంచి కనిపించింది. గేటు దగ్గర బోయ్ స్కౌట్స్ కర్రలతో ఎత్తిన 'గార్డ్ ఆఫ్ ఆనర్', వెనక నుంచి వాద్య సంగీతం.

కారు నెమ్మదిగా వేదిక వద్దకు వచ్చి, ఆహ్వానించేందుకు వేదిక కిందకు వచ్చి నించున్న హెడ్ మాస్టర్ వద్దకు వచ్చి ఆగింది. హెచ్.ఎం వెంటనే కారు తలుపు తీశారు.

అందులో నుంచి అసిస్టెంట్ హెడ్‌మాస్టర్ వినయ భూషణ ముజుందార్ తన బిళ్ళ గోచీ పంచె ముందర కుచ్చిళ్ళ కింద అంచులు ఎత్తి, తన లాల్చీ పక్క జేబులో పెట్టుకుంటూ చిరునవ్వుతో దిగారు.

ఆ వెనకే హెచ్.ఎంగారు అందించిన చెయ్యి కూడా అక్కర్లేకుండానే జాలయ్య మేస్టారు దిగారు చేతిలో బెత్తంతోసహా.

టీచర్లు అందరూ వచ్చి గుమికూడి నమస్కారం చేశారు. జాలయ్య అందరికీ తిరిగి నమస్కరించారు. ఆజానుబాహులు, సందిళ్ళకి ఇమడని చాతీ, పచ్చటి దేహ ఛాయ, కిర్రు చెప్పులు, జరీ తలపాగ, మెలి తిప్పిన నల్లటి కోర మీసాలు, గంభీరమైన చూపులతో జాలయ్య వేదిక కింద మెట్టు మీద కాలు పెట్టగానే సభలో అందరూ మెడలు చాచి చూడనారంభించారు. ఒక పక్కన హెడ్‌మాస్టర్, మరో పక్కన ముజుందార్, మధ్యన జాలయ్య ఏ చెయ్యీ సహాయం లేకుండానే మెట్లెక్కి వేదిక పైకి వచ్చారు.

వాద్య సంగీతం అయిపోయింది. అందరూ కూచున్నాక ముజుందార్ కవల పిల్లలు 11 ఏళ్ళ ఆరతి, అంజలి పెద్ద ఆరిందాల్లాగా ఎర్రటి చీరలతో, వాలు ముసుగులతో, ఎర్రటి గాజులు చేతుల నిండా తొడిగి, ఎర్రటి కుంకుమ బొట్లు పెట్టుకుని, చిన్న ఆభరణాలు పెట్టుకొని బొమ్మల్లా తెర వెనుక నుంచి వేదిక ముందరికి వచ్చారు.

కిందికి దించి ఉన్న మైక్ వద్దకు వచ్చి సభను చూసి ఒక్కసారి తలలు వంచి నమస్కరించారు. జోడించి ఉన్న చేతులతోనే తిరిగి తలలు ఎత్తి కళ్ళు మూసుకుని భావయుక్తంగా ప్రార్థన పాడనారంభించారు.

వెంటనే వెనుక నుంచి వీణ, వయొలిన్, తబలాలతో సంగీతం మొదలైంది. ఇంపుగా నిమ్మళంగా భక్తి పారవశ్యంతో ఆ లేత గొంతులు పాడుతుంటే ఆ ప్రార్థనకి అప్రయత్నంగా, ఆయాచితంగా అందరూ లేచి నించుని తలలు వంచారు.

పాట అయిపోగానే, పిల్లలిద్దరూ మరొకసారి తలలు వంచి ముచ్చటగా వెనక్కి తిరిగి కాళ్ళ పట్టీలు ఘల్లు ఘల్లుమంటుండగా వేదిక వెనక్కి వెళ్ళిపోయారు.

సభ అంతటా ఒక గంభీరమైన వాతావరణం అలుముకుంది. నిత్యానందం మైక్ ముందరికొచ్చి ఆహ్వాన సందేశాన్ని వినిపించారు.

హెచ్.ఎం గారు లేచి మర్యాదగా జాలయ్య మేస్టారుకు కరతాళధ్వనుల మధ్య పూలమాల వేశారు.

తరువాత ఇంకో దండ ముఖ్య అతిథి భవాన్ సింగ్ గారికి వేశారు. తరువాత తన సీటులో కూచోగానే ముజుందార్ హెచ్.ఎంకి వేశారు. ఈ లాంఛనాలన్నీ ముగిశాక సత్యనారాయణ లేచి ప్రసంగించారు.

"నాకు రెండు దశాబ్దాల సర్వీసు ఉండడం వల్ల జాలయ్య మేస్టారు గారి గురించి మాట్లాడే భాగ్యం నాకు లభించింది" అని మొదలెట్టి, "జాలయ్య గారి గాంభీర్యం వల్ల మన స్కూలుకు ఇంత పేరు వచ్చింది. కంచు కాగడా వేసి వెతికినా తుంటరి తనాలు, అల్లర్లూ ఏమీ కనబడవు. చదువు



చిత్రాలు: నర్సిం

సంధ్యలలో మన విద్యార్థులు ర్యాంకులు తెచ్చుకుంటున్నారు. యావత్తు స్కూల్లోనూ వారి భయం వల్ల విద్యార్థులు శ్రద్ధగా చదువుతున్నారు. వారి పేరు చెబితేనే ఎటువంటి రాలుగాయి కుర్రాళ్ళయినా మంత్రముగ్ధులవడం నేనెరుగుదును. ర్యాగింగ్ గాని, ఈల పాటలు గాని ఏ రకంగానూ మన స్టూడెంట్స్‌లో లేవు. మర్యాదలూ, పద్ధతులూ ఇంకా నిలిచి ఉన్నాయి. ఈనాడు మనం అందరమూ బరువైన మనసులతో వారికి వీడ్కోలు ఇస్తున్నాం. ఇకమీద వారిని ఈ ఆవరణలో మనతోపాటు చూడలేం. ఆ మాట అనుకుంటేనే మనకి ధైర్యం తగ్గుతోంది. వారు దగ్గర లేకుండా ఈ స్కూల్లో ఈ క్రమశిక్షణ, ఈ వాతావరణం నిలపడం మనవల్ల అయ్యే పని కాదు. నయాన, భయాన చెప్పి పిల్లల్ని తీర్చిదిద్దడం వారికే సాధ్యమైంది. కానీ ఒక్కటి మాత్రం చెప్పగలను. వారు అతి కఠినంగా పిల్లల్ని భయభక్తుల్లో ఉంచారు అనుకుంటారేమో, వారి గాంభీర్య, ముక్తసరి మాట, వారి చేతిలో శిశు మర్దనకు నిరంతరంగా ఆ బెత్తమూ చూస్తే అలాగే అనిపిస్తుంది. కానీ, ఆ చేతి బెత్తం వారు ఎన్నడూ, ఎంతటి అణగని కుర్రాడి మీద కూడా ప్రయోగించినట్లు మేమెవరమూ, ఎప్పుడూ చూడలేదు. వారే సింహస్వప్నం. వారు రిటైర్ అయితే అంత బాధ్యతలూ మనం మోయలేం. కానీ మన హెచ్.ఎం గారి సహాయ సానుభూతులతో ఏ కొద్దో సాధించాలి. అది తృణప్రాయం. ఎంత చేసినా మనం ఇంక అసహాయులమే. మనకి అది తీరని కొరత" అంటూ ముగించారు.

వారి తరువాత అబ్రహామ్ లేచారు. "జాలయ్య మేస్టారు మన స్కూలు ల్యాండ్ స్కేప్‌లో ఒక భాగం. వారు లేని స్కూలును ఊహించలేము. ఎలా అంటారా? మేమంతా ఏదో ఒక రీతిగా ముందు వెనుకగా స్కూలుకు చేరతాం. కానీ, స్కూలు ఆఫీసు రూమ్‌లోనించి మా కంటికి కనిపించే దృశ్యం దినమూ ఒక్కటే. ప్రతి దినమూ ఫస్ట్ బెల్ ఒక నిమిషం పాటు నిదానంగా మోగుతుంటే, అంతసేపూ జాలయ్య గారు అదే నిటారు నడకతో, అదే రకపు డ్రసింగ్‌తో అంత కాంపౌండూ నడచి గంట పూర్తయ్యేలోగా ఆఫీసు రూముకి వస్తారు. వానరానీ, వరద రానీ. ఆ క్రమశిక్షణ మాలో ఎవరికీ లేదు. ఈనాటి నుంచి ఆ దృశ్యం ఇహ మేము చూడము. ఆ క్రమశిక్షణ, ఆ టైమ్ సెన్స్ రావాలంటే వారి వద్దనే తర్ఫీదవ్వాలి. ఈ నాటి నుంచీ ఆ తర్ఫీదు మనకిచ్చేవారు లేరు. వారి ప్రవర్తనతోనే వారు పాఠం చెప్పారు. వారి చేతిలో నిరంతరమూ ఉండే ఆ బెత్తంతో కొట్టి చెప్పలేదు." ఈ ధోరణితో సాగింది అబ్రహామ్ టీచర్ ప్రసంగం.

తరువాత మరి ఇద్దరు మాట్లాడారు, ఇంచు మించు అలాగే. అప్పుడు ఐ.పి.ఎస్ భవాన్ సింగ్ లేచారు. "నేను స్వతహాగా బద్ధకస్థుణ్ణి. నాకు ఆశలెక్కువగా ఉండేవి. నేను గొప్ప చదువరినవ్వాలని ఒక ఆశ. మా తాతగారి ఊరులో చదువుకుంటుండేవాణ్ణి. సెలవులు వచ్చినప్పుడు మా నాన్నగారు అడిగారు, "ఈ ఊళ్ళో చదువుకోరా. జాలయ్య మేస్టారు క్రమశిక్షణకు పెట్టింది పేరు. నువ్వు ఐ.పి.ఎస్‌లో చేరాలని ఉందన్నావుగా" అన్నారు. దాంతో జాలయ్యగారి శిష్యుణ్ణి అయ్యాను" అని ఆరంభించారు.

"అలా చదువుకుని యూనివర్సిటీలో సెకండ్ వచ్చాను. ఈనాడు ఇంత ఉద్యోగస్థుణ్ణయ్యాను. అయితే, వారితో, వారి చేతి బెత్తంతో ఒక్క దెబ్బ కూడా తినలేదు. క్రమశిక్షణకు పేరుపొందిన డిపార్ట్‌మెంట్‌లలో మాది ఒకటి కదా. మా డిపార్ట్‌మెంట్‌కు తగినంత శిక్షణ జాలయ్య మేస్టారు వద్దనే నాకు లభించింది. నేను వారి శిష్యుణ్ణి అని చెప్పుకోవడానికి గర్వపడుతున్నాను. వారికి నా కృతజ్ఞతలు" అని ముగించారు.

తరువాత జాలయ్య మేస్టారు లేచారు. గంభీరంగా, "ఇంతమంది ఇన్ని విధాల పొగడుతుంటే నాకు నిజంగా మనసు ఉప్పొంగుతోంది. ఈ రోజు మీరంతా నామీద చూపిన ఈ ప్రేమలు నేను నా జీవితంలో ఎప్పుడూ మరువలేను. నన్ను ఇష్టం వచ్చినప్పుడల్లా స్కూలుకు వచ్చి సహాయసానుభూతులిమ్మని స్టాఫ్ అందరూ అడిగారు. దానికి కృతజ్ఞుడను. కానీ, అధికారపూర్వకంగా నేను రేపట్నించీ ఈ కాంపౌండులో అడుగుపెట్టలేను. ఏదో నావల్ల అయినంత వరకూ కుర్రాళ్ళకు విద్యాబుద్ధులు చెప్పి తర్ఫీదు చెయ్యగలిగాను. నాకా తృప్తి చాలు. ఇవ్వాళ నుంచీ ఆ తృప్తి ఉండదు నాకు" అంటూ మొదలెట్టారు.

"ఇహ ఇప్పుడు నేను మీకెవరికీ తెలియని ఒక్క విషయం చెప్పి వీడ్కోలు తీసుకుంటాను. నేను ఏ విద్యార్థినీ ఈ బెత్తంతో ఎన్నడూ దెబ్బ కొట్టగా ఎవరూ చూడలేదని అందరూ అన్నారు. అది నిజం. ఎవరూ, ఇప్పుడు ఇక్కడ ఉన్నవాళ్ళెవరూ చూడ లేదు. కానీ ప్రథమ రోజుల్లో నాకు ఇంత సహనం లేదు. చదవక పోతే దెబ్బ, హోమ్ వర్క్ చెయ్యకపోతే దెబ్బ, ఆలస్యంగా క్లాసుకు వస్తే దెబ్బ, ప్రశ్నకు సమాధానం చెప్పకపోతే దెబ్బ. నేను ముందు దెబ్బ కొట్టిన తరువాతే మాట్లాడేవాణ్ణి. ఆ క్లాసులో ఒక చిన్న కుర్రాడు ఓ వారం రోజులు వరుసగా లేటుగా వచ్చాడు. పైగా హోమ్ వర్క్ చెయ్యడం లేదు. అన్నీ మర్చిపోతున్నాడు. ఓ ప్రశ్న వేసాను. తబ్బిబ్బులాడాడు. 'వారం నుంచీ ఇదే వరసా నీకు' అంటూ ఈ బెత్తంతో చెళ్ళుమని ఒక్కటి వేసాను. కిక్కురుమనలే. 'ఇంత గర్వమా నీకు' అని 'బెంచి ఎక్కి నించో' అన్నాను. బెంచిమీద నించున్నాడు. నేను యథాప్రకారంగా క్లాసు సాగిస్తున్నాను. ఒక్క అర నిమిషంలో 'ధప్'మని ఏదో శబ్దం వినిపించింది పెద్దగా. నించున్న ఆ కుర్రాడు ధభీల్న కింద పడిపోయాడు. క్లాసు అంతా అలజడి అయింది. వాడి పక్కనే కూచున్న-నా వద్ద ట్యూషన్ తీసుకుంటున్న స్టూడెంట్ రాజు చటుక్కున బయటకు పరిగెత్తి నీళ్ళు తెచ్చి వాడి ముఖం మీద చల్లాడు. వాడికి స్పృహ రాగానే బయట వరండాలోకి తీసికెళ్ళి పడుకోబెట్టారు.

నేను వెంటనే క్లాసు ముగించేశాను. ఆనాడు సాయంత్రం రాజు ట్యూషన్‌కు వచ్చినప్పుడు, 'ఆ కుర్రాడు మిమ్మల్ని క్షమాపణ వేడుకుంటాడుట. అతను చదవనందువల్ల మీరు కొట్టారుట' అన్నాడు. నేనేమీ మాట్లాడలేదు. కాస్సేపాగి రాజు పొడిగించాడు. 'అతను అనాథ సార్. తల్లితండ్రులు లేరు. రోజుకి ఒకరి ఇంట్లో ధర్మానికి భోంచేసి చదువు కుంటున్నాడు. ఓ వారం దినాలుగా ఒకరి ఇంట్లో పెళ్ళిళ్ళు. ఇళ్ళూ అవీ కడిగించి చిన్నాచితకా పనులు చెప్పారు ఆ ఇంటివారు. దీనితోపాటు పొద్దున భోంచేసి వస్తే స్కూలుకి ఆలస్యమవుతుందని భోంచెయ్యకుండా వచ్చేశాడు. అంతేసార్. నిద్ర చాలడం లేదు కూడాను. అందువల్ల శోషకొచ్చి పడిపోయాడు సార్' అన్నాడు.

> ఆ ఇద్దరు
> కౌగలించుకుని
> బాహ్య ప్రపంచాన్ని
> మరిచిపోయారు.
> సభ అంతా
> నిర్ఘాంతపోయింది.
> అంతా నిశ్శబ్దంలో
> మునిగిపోయింది.

ఆనాడు నిర్ణయించాను ఇక ఈ బెత్తం ఎవరి మీదా ఉపయోగించకూడదని. నేను ఎవరి వద్దా ట్యూషన్ ఫీజ్ తియ్యను. 'ఆ కుర్రాడు కూడా ట్యూషన్‌కు రావచ్చా సార్' అని అడిగాడు రాజు. 'రమ్మను' అన్నాను ముక్తసరిగా.

మరునాడు సాయంత్రం మిగతా విద్యార్థులతో పాటు ఆ కుర్రాడు కూడా ట్యూషన్‌కు వచ్చాడు. అందరూ వెళ్ళాక నేను వంట ఇంట్లోకి వెళ్ళి భోంచేసి పడుకునేముందు బయట తలుపు గడియ వేయడానికి వచ్చాను. వీధి లైట్ల వెలుగులో బయట అరుగుమీద ఆ కుర్రాడు కుక్కపిల్లలా ముడుచుకుని పడుకుని ఉన్నాడు. నా అలికిడికి లేచి నించున్నాడు. 'సార్, ఇంతరాత్రి వెడితే వాళ్ళెవ్వరూ తలుపు తియ్యరు సార్. ఈ రాత్రి ఇక్కడ పడుకోనా సార్ ఈ అరుగుమీద' అన్నాడు భయం భయంగా, నిమ్మళంగా. 'సరే పడుకో' అని వెళ్ళబోతూ, 'అన్నం తిన్నావా?' అని అడిగాను. 'రేపు పొద్దున తింటాను సార్' అన్నాడు కచ్చితంగా. 'లోపలికి రా. వంట ఇంటి గుమ్మంలో అన్నం, పులుసూ, కూర ఉన్నాయి కాస్త. అది తిను' అన్నాను. 'సరే సార్, థ్యాంక్స్' అన్నాడు.

మరునాడు పొద్దున లేచి చూస్తే, గిన్నెలన్నీ కడిగి నూతి దగ్గర బోర్లించి ఉన్నాయి. మరునాటి నుంచీ మరో గుప్పెడు బియ్యం వేసి వండడం ఆరంభించాను.


పరీక్షల ముందు రెండు నెలలూ అందరితో పాటు ఆ కుర్రాడు కూడా ట్యూషన్ తీసుకున్నాడు. పరీక్షలు ముగిశాయి. వేసవి సెలవులు ఆరంభం అయినాయి. వరలక్ష్మి యాత్రా సర్వీస్ వారు పుణ్యక్షేత్ర యాత్రలకి నన్ను కూడా రమ్మన్నారు. సరే, ఇక్కడుండి మాత్రం చేసేదేముంది లెమ్మని నేనూ బయలుదేరాను వారితో కలసి.

స్కూళ్ళు తెరిచారు. రాజు నాకు కనబడలేదు. వాడి ఫ్రెండు, ఆ వారభోజనాల కుర్రాడూ కనబడలేదు. కానీ, ఆఫీసు రూములో చెప్పారు. రాజు తండ్రిగారికి ట్రాన్స్‌ఫర్ అయిపోయిందిట. వాడి ఫ్రెండు ఆ అనాథ కుర్రాడు ఫస్ట్‌క్లాస్‌లో పాస్ అయ్యాడుట. టి.సి తీసుకుని వెళ్ళిపోయాడుట.

కాని, ఈ వేళ నుంచీ నేనూ ఒక అనాథనే. నాకూ ఎవరూ లేరు. చిన్ననాడే భార్య పోయింది. ఇన్నాళ్ళూ ఈ స్కూలు నాకు ఒక దిక్కయింది. ఒక వ్యాపకం, ఒక బాధ్యత, ఒక సందడి. మీరంతా చుట్టూ ఉన్న ఒక తెలియని రీతి తృప్తి, ఇవన్నీ ఉండేవి. ఈ వేళ నుంచి నేను అన్నీ వదులుకుని ఎప్పటిలా నా ఈ ఒంటరి బతుకు బతకాలి. ఈ అనాథ బతుకు. ఆ పిలుపు వచ్చేవరకు నా బతుకు ఇంతే. మీరు ప్రేమతో ఇచ్చిన ఈ టీవీ నేను తీసుకుంటాను. కానీ, మీరందరూ నాకిచ్చిన ఈ పొగడ్తలు మాత్రం నేను ఇప్పుడు చెప్పిన అనాథ కుర్రాడికే చెల్లాలి. అదే న్యాయం దైవ నీతిలో" అన్నారు.

జాలయ్యగారి కళ్ళలో గాంభీర్యం చటుక్కున మాయమైంది. ఎన్నడూ ఎవరూ చూడని దైన్యం కనిపించింది వారి కళ్ళలో. వారి దేహం ఒడ్డూ పొడుగూ తగ్గినట్టు అనిపించింది అందరికీ. మనిషి కుంగారు.

"మిత్రులందరూ చూపిన ఈ ప్రేమ గౌరవాలకి నేను కృతజ్ఞుడను. ఈ సంతోష ఘడియలూ, ఈ వేళ ఈ సాయంత్రమూ, నా జీవితంలో నా ఒంటరి జీవితంలో మరువను. మరువలేను. నమస్కారం"



అని కూచున్నారు.

సభ ముగింపుకు హెడ్‌మాస్టర్ గారు లేచారు. "మన స్కూలు చరిత్రలో ఇదొక మరుపురాని రోజు. మన సీనియర్ మోస్ట్ టీచర్ జాలయ్యగారు మనల్నీ, మన స్కూల్‌నీ ఒదిలి వెళ్ళిపోతున్నారు" అని ఆరంభించారు.

"ఇంతమందికి క్రమశిక్షణ, విద్యాబుద్ధులు నేర్పి మన స్కూలుకి ఇంత ఘనకీర్తి తెచ్చి ఇచ్చారు. ఈ స్కూలు చరిత్రలో వారి పేరు శిలాక్షరాలతో నిల్చి ఉంటుంది. వారిని చూసుకుని మనం చాలా గర్వపడాలి. వారు మన స్కూలుకి ఇంతవరకూ తెచ్చి పెట్టిన పేరుప్రతిష్ఠలు కాపాడుకోవలసిన బాధ్యతలు ఇహ నుంచి మనవి. అది మన భారం. అది మనకు చాలా దుస్సాధ్యమైన పని అని నాకు తోస్తోంది. కానీ, మన ప్రయత్నాలకి వారు సహాయ సానుభూతులు అందిస్తారని నా ధృడ విశ్వాసం.

ఇది మామూలు వీడ్కోలు కాదు. ఒక లాంచన విశేషమూ కాదు. మన అందరి మనసుల్లోనూ ఈ వేళ ఒక తీవ్రమైన మనోబాధ ఉంది. కానీ, మన అందరి కంటే జాలయ్య మేస్టారు గారి హృదయం చాలా బాధలో ఉంది. కాస్త ఆలోచిస్తే, వారి హృదయ భారం ముందు మన గుండె బరువులు ఏమాత్రం అనిపిస్తోంది. వారి జీవితయాత్రలో ఈ ఆఖరు సంవత్సరాలు ఇంత ఒంటరితనంతో గడపాలి అన్నాడే, ఆ మాటలు వినగానే నిజంగానే మన గుండెలు జారిపోతున్నట్టు అనిపిస్తోంది కదా! ఇంకో మాట కూడా చూడండి. వారి సౌజన్యత చూశారా? ఇప్పుడూ అందరు ఇచ్చిన జోహార్లు వారి మానసిక మార్పునకు కారణమైన ఆ అనాథ బాలుడికే చెల్లాలి అన్నారు.

అది మామూలు మాట కాదు. మామూలు వాళ్ళు ఆ మాట అనరు. ఆ మాట చాలా ఉన్నతమైనది. ఎందుకంటే, ఆ అనాథ కుర్రాడికి వారు భోజనం పెట్టి జీతం లేకుండా ట్యూషన్ చెప్పడం వారు ఎక్కువగా అనుకోవడం లేదు. అదే వారిలో ఘనత. ఎదుటి వాళ్ళు చేసిందే ఎక్కువగా భావిస్తున్నారు. దానిలో వారి ధర్మబుద్ధీ, మానవత్వమూ మనకి తేటతెల్లంగా తెలుస్తున్నాయి. ఇటువంటి స్వలాభమే ఎరుగని మన జాలయ్య మేస్టారు గారి ఆఖరు సంవత్సరాల ఒంటరి జీవిత యాత్ర, అందులోనూ వృద్ధాప్యంలో ఊహించు కోవడానికే కష్టం, ధీరులకైనా వీరులకైనాగాని.

అందువల్ల ఘనత వహించిన మీ అందరి ముందు ఈ మా ఆదర్శ ఉపాధ్యాయులు జాలయ్య మేస్టారుగారికి ఒక విన్నపం చేసుకుంటున్నాను. నాదీ ఒక రిక్వెస్ట్.

వారు ఆఖరు రోజుల్లో ఒక అనాథగా, ఒంటరిగా బతకాలి అని అన్నమాట నా హృదయంలో గాయమైంది. అలా వారు బతకనక్కర్లేకుండానే నేను చేసుకుంటున్న ఈ విజ్ఞప్తి" అన్నారు సభ వంక చూస్తూ.

సభలో ఏ కదలికా లేదు.

"వారిని నేను వేడుకునేదేమిటంటే, నన్ను వారు కుమారునిగా స్వీకరించి నన్ను దత్తు చేసుకోమని నేను ప్రార్థిస్తున్నాను." సభకు చేతులు జోడించి, "ఎందుకంటే, నాకూ ఎవరూ లేరు" అని పొడిగిస్తూ, "పైగా జాలయ్య మేస్టారు ఇందాక అంత హెచ్చు స్థాయిలో ప్రస్తావించిన ఆ చిన్న అనాథ బాలకుణ్ణి నేనే" అంటూ చటుక్కున వెనక్కి తిరిగి జాలయ్య మేస్టారు పాదాలకు వంగి నమస్కరించాడు రెండు చేతులతో.

జాలయ్య గారి ముఖంలో పసితనం కనిపించింది. వారి చేతిలో బెత్తం జారి కింద పడిపోయింది. వెంటనే వంగి రెండు చేతులతో హెచ్.ఎం గారి ఠీవి గల భుజాలు పట్టి లేవదీశారు.

ఆ ఇద్దరు కౌగలించుకుని బాహ్య ప్రపంచాన్ని మరిచిపోయారు. సభ అంతా నిర్ఘాంతపోయింది. అంతా నిశ్శబ్దంలో మునిగిపోయింది. పండుటాకు పడితే ప్రతిధ్వనించేటట్టుంది.

ముందరి శ్రేణిలో కూర్చున్న కౌన్సిలర్ కోటయ్య నోరు తెరిచే ఉంచారు. పక్కనే కూర్చున్న కన్యకా స్త్రీలు కాస్త తలలు వంచి సైన్ ఆఫ్ ది క్రాస్ చేసుకున్నారు.

అంతటా నిశ్శబ్దం.

దూరాన టెన్నిస్ కోర్టు పక్కన కొబ్బరి చెట్టు మీది గూట్లో కొంగ పిల్లలు "కే, కే"మని గట్టిగా అల్లరిగా అరిచాయి. తల్లి కొంగ ఇంకా గట్టిగా "బ్యేక్ బ్యేక్" మంటూ గసిరింది. గప్ చిప్. అంతా నిశ్శబ్దం. చెట్టు వెనక నుంచి అప్పుడే పైకి వస్తున్న చంద్ర కిరణాల్లో కొబ్బరాకులు ఒక అపూర్వమైన పచ్చదనంతో అందంగా, చిన్నగా గాలిలో ఆడుతున్నాయి.

వేదిక మీద అప్పటికి తెప్పరిల్లిన నిత్యానందం ఒక్క అంగలో ముందరికొచ్చి సభని చూసి తన రెండు చేతులతో చప్పట్లు కొట్టారు. అప్పుడే స్పృహ వచ్చినట్లు అందరూ లేచారు. సంతోషంతో చప్పట్లు కొట్టడం ఆరంభించారు భూమీ, ఆకాశం మారుమోగేటట్టు. ■